# ఆ నాటి మాట

అప్పటికి ఇంకా చిన్నతనం.

కాలేజీలో చదువుతున్న రోజు లవి.

ఏ అనుభవం లేదు.

జీవితం అంటే ఏమిటో తెలియదు.

ఉద్రేకోద్వేగాలు పొంగులెత్తి, దారీ తెన్నూ తెలియని మైకంలో పడుతున్న రోజులవి.

అప్పట్లో ఎదిగిన అమ్మాయిల వంక చూడడం ఒక సరదా. కనపడిన ప్రతి అమ్మాయినీ చూపులతో పలుకరించి, కవ్వించి, బెల్లించడమంటే ఎంతో ఉత్సాహంగా ఉండేది. చూపులతో పిలిచి స్నేహం చేసుకోవడంతో ఆగక, ఇంకా ఇంకా ఏవేవో సయ్యాటలాడాలని ఉండేది మనస్సులో — కాని ధైర్యం ఉండేది కాదు.

సాహసం చాలేది కాదు.

కోరికలు ఆకాశం ఎత్తున లేచేవి —

ఆ వెంటనే శతసహస్ర నేత్రాలు వాడిచూపులతో వాటిని వారించేవి — లక్ష గొంతుకలు, "చూడు! ఇది నీకు తగదు" అని ఏక కంఠంతో హెచ్చరిక చేసేవి. విధిలేక కోరికలు కళ్ళముందు కుప్పగా కూలేవి. హెచ్చరిక చేసిన గొంతుకల పాదాల క్రింద నలిగేవి. నుసిగా మారేవి. పిరికితనం, ఆ నుసిని హృదయంలో పదిలపరిచేది. చివరకి ఆ నుసి కూడా కోరికలతో బుసలు కొట్టేది. కోరికలు తిరిగి విజృంభిం

చడం ... తిరిగి నుసి కావడం...ఇదీ విషయవలయం ... ఈ విషవలయంలో చిక్కుకొని, ఆశానిరాశలమధ్య గిలగిల తన్ను కుంటున్న రోజులవి —

రోజూ సాయంత్రం దుస్తులుమార్చి, ముస్తాబై గది నించి బయల్దేరేవాడిని.

ఒక దారని నిర్ణయంలేదు.

కాళ్ళు ఏ దారిపడితే, అదే ఆ సాయంత్రానికి దారి—

ఒకచోటని నియమంలేదు.

ఎక్కడికి వెడితే, అదే ఆ సాయంత్రానికి గమ్యస్థానం—

దారిలో కనపడిన అందమైన అమ్మాయిలని వెంటాడడం, అన్వేషించడం, ఇదీ ఆ రోజుల్లో పని—

దగ్గరికి వెళ్ళడానికి ధైర్యం చాలేదికాదు.

ఎవ్వరినీ పలకరించడానికి, అంతకన్నా సాహసముండేది కాదు—

అడుగడునా పిరికితనంపట్టి బాధించేది.

దూరంనించి చూపులు కలపడం, ఆ చూపులు కలవక దిగజారిపోవడం, ఆ అమ్మాయిలను, వాళ్ళ వాళ్ళ యిళ్ళదాకా సాగనంపడం, కొత్త కొత్త యిళ్ళని పరిచయం చేసుకోవడం, రోజులతరబడి ఆ యిళ్ళచుట్టూ తిరగడం, మనసారా కోరు కున్న అమ్మాయిలు కనపడక బేజారెత్తడం, వదలలేక వదల లేక చిరపరిచితమైన యిళ్ళని వదులుకోవడం, సరికొత్త ఇళ్ళని వెతకడం, ప్రతి సాయంత్రం, విసిగి, వేసారి, ఏ ఫలితంలేక, ఊసురోమని కాళ్ళీడ్చుకుంటూ గదికి చేరుకోవడం, ఆ ఆలోచనలతోనే పక్కమీద మేనువాల్చడం ఎంతకీ నిద్రపట్టక అవస్థ పడడం, ఇదీ ఆ రోజుల్లో నిత్యకృత్యం—

ఒక రోజు కాలేజీకి వెళ్ళడమంటే ఏ మాత్రం మన స్కరించలేదు.

విధిలేక గదిలోనే ఉండిపోయాను.

ఏమీతోచదు.

పుస్తకం తీసుకుంటే పంక్తుల తరబడి, పుస్తకంలోంచి అమాంతంగా ఎగిరిపోతున్నాయి.

పడుకుంటే నిద్రరాదు.

కాలచక్రం తిరగదు.

పక్కమీద దొర్లుతూ ఏదోవిధంగా కాలం గడిపాను.

ఇంక గదిలో, ఒక క్షణమైనా నిలువలేక పోయాను.

నాలుగింటికల్లా, గదినించి ముస్తాబై బయల్దేరాను.

కాళ్ళు ముందుకు నడుస్తున్నాయి.

నిరంతరాన్వేషణ...కాదు మహాప్రస్థానం, ప్రారంభ మైంది.

సుల్తాన్ బజార్ చౌరస్తా ... చౌరస్తాలో పల్చగా జనం...కనుచూపుమేరలో ఎక్కడా యౌవనంకాని, అందం కాని కనపడలేదు.

ఈసారి తిరిగి, నిశితంగా దృష్టిసారించాను.

దూరంగాకోఠీవేపునించి, ఇద్దరు అమ్మాయిలు, చౌరస్తా వేపు హంసనడకలతో తేలివస్తున్నారు.

ఇద్దరిచేతుల్లో పుస్తకాలు.

యౌవనానికి అందచందాలకి స్వాగతం చెప్పడానికి, ఎదురునడిచాను—

క్రమంగా అమ్మాయిలు దగ్గరపడుతున్నారు—

ఒక అమ్మాయిది గుండ్రని మొహం — బొద్దుగా అందంగా ఉంటుంది.

ఇంకొక అమ్మాయిది కోలమొహం — సన్నగా, పొడుగ్గా ఉంటుంది.

యౌవనం పొంగిపొర్లి, ఎత్తు పల్లాలని ఏర్పరచి, శరీరాలని తీర్చిదిద్దుతున్నది—

అందం, ఆ వదనాలకి, వింతసోయగాన్ని చేకూరుస్తున్నది—

లావుపాటి అమ్మాయి నాకు నచ్చింది—

హృదయం, "అటో, ఇటో, తేల్చుకో"మ్మని నన్ను ఇబ్బంది పెట్టింది—

ఇద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నారు—నన్ను గూర్చి కాదుకద?

ఏమో?

లావుపాటి అమ్మాయి, నేనూ ఎదురు పడ్డాము—

చూపులు కలిశాయి. కళ్ళతో చిరునవ్వు నవ్వింది. నా తల గిర్రున తిరిగింది.

ఆ అమ్మాయిలు, నా ప్రక్కనుంచి తప్పించుకుపోయారు.

వెంటనే వెనక్కి మళ్ళితే బాగుండదని, వంద గజాలు ముందుకు నడచి, నేనూ వెనక్కి తిరిగాను.

నాకూ, వాళ్ళకూ దాదాపు వంద గజాల ఎడం — ముందు వాళ్ళూ, వెనకాల నేనూ.

వాళ్ళను అందుకోవాలని నేను చక చకా ముందుకు నడిచాను. ఆ అమ్మాయిలు, వెనక్కి తిరిగి చూడకుండా, ముందుకు గబ గబా వెడుతున్నారు.

నేను క్రమంగా వాళ్ళని సమీపిస్తున్నాను.

ఇంతలోనే, ఆ అమ్మాయిలు బడి, చావుడీ పక్కసందు లోకి మళ్ళారు—ఒక యింట్లోకి అదృశ్యమైనారు.

ఆ నాడు ఆ యింటిముందు ఎన్నోసార్లు పచార్లుచేసాను. కాని లాభం లేకపోయింది.

తిరిగి ఒక గంట తరువాత వెళ్ళాను. అయినా లాభం లేకపోయింది.

విసిగి గదికి చేరుకున్నాను—దుస్తులైనా విప్పకుండా పక్కమీద పడ్డాను.

కాని—

ఆనాటితో జీవితంలో ఒక లక్ష్యం ఏర్పడింది — ఒక పెన్నిధి దొరికింది.

ఆ రోజునుంచీ ప్రతి సాయంత్రం నాలుగు గంటలకల్లా, ఒక్క శుక్రవారాలు తప్ప, సుల్తాన్ బజార్ కి వెళ్ళడం, ఆ అమ్మాయిలనుకలుసుకోవడం, వాళ్ళనిఇంటిదాకా దిగబెట్టడం, ఇదీనా నిత్యకృత్యం—శుక్రవారం, ఆ రోజుల్లో, బడులకీ, ఆఫీసు లకీ సెలవు దినం. ఒక రోజు వాకిలి గుమ్మంలో, వాళ్ళ తల్లి కనబడింది. ముగ్గురూ కలిసి, ఏదో మాట్లాడుకున్నారు. నన్ను గూర్చే నని నా అనుమానం. ఆ నాడు ఏదో ముప్పు వాటిల్లు తుందనుకున్నాను. కాని అల్లాంటిదేమీ జరగ లేదు.

ఆ ముగ్గురూ, నన్ను గూర్చి అప్పుడప్పుడు మాట్లాడు కోవడం, నేను గమనిస్తూనే ఉన్నాను.

కాలచక్రం రెండు మాసాలు చుట్టివేసింది—

నేను చెడి పోతున్నానని తెలిసి, మా నాన్నగారు పట్నం రావడం, పట్నంలో నాలుగు రోజులపాటు మకాం

వేయడం, ఈ గొడవలతో నేను ఆ నాలుగు రోజులు సుల్తాన్ బజార్ కి వెళ్ళలేక పోయాను.

అయిదవ రోజు సాయంత్రం, నాలుగు గంటలకి ముందే సుల్తానుబజార్ కి చేరుకున్నాను.

ఎందుకో ఆ రోజున ఎంతకీ నాల్గు కాదు.

కాలుకాలిన పిల్లి కిమల్లే చౌరస్తాపైన పచార్లుచేసాను. హోటల్ లో టీ తాగాను. ఎందుకో 'టీ' చేదు మింగినట్లని పించింది.

అప్పటికీ నాలుగు కాలేదు—

కాలచక్రం తిరగడం మానుకోలేదు కద? ఏమో?

ఏదో గుండెల్లో దడ ...

ఏదో దిగులు —

పెదవులు ఎండుకు పోతున్నాయి —

ఎందుకో నోరు ఆరిపోతున్నది —

అమ్మయ్యా! నాలుగ్గంటలు! క్లాక్ టవర్ నాలుగు గంటలు కొట్టింది —

ఇంక అట్టేసేపు అక్కడ నిలబడలేక పోయాను —

అనాలోచితంగా కోఠీవేపు నడిచాను —

ఏదో చెప్పరాని భయం —

సుల్తాన్ బజార్ చౌరస్తా... కోఠీ... పుత్లీ బావుడీ ... ఎక్కడా ఆ అమ్మాయిల జాడ లేదు—

నాలుగున్నర ... బడికి వెళ్ళలేదా? ... ఏమో?

అమాంతంగా వెనక్కి మళ్ళాను – బడీ, చావిడీ దారి పట్టాను – ఎందుకో కాళ్ళు తడబడుతున్నాయి.

శరీరం నడుస్తున్నది—

కాని మనస్సులో మనస్సు లేదు—

శరీరం నడకగా మారింది—

మెకానికల్‌గా బడీ,చావిడీ పక్క సందులోకి మళ్ళాను.

ఆ ఇంటి ముందు ఇసుక వేస్తే రాలకుండా జనం—

అంత జనం పోగు కావడానికి కారణం?

ఏమో?

గబగబా వెళ్ళి జనం మధ్యలో పడ్డాను—

జనాన్ని చీలుస్తూ మధ్యలోకి చొచ్చుకు వెళ్ళాను—

జనం మధ్యలో ఖాళీస్థలం – ఆ ఖాళీస్థలంలో ఆ బొద్దు అమ్మాయిని పాడెలో పడుకోబెట్టి తాళ్ళు బిగిస్తున్నారు.

నా కళ్ళని నేను నమ్మలేకపోయాను—

అంతా ఏదో అయోమయంగా వుంది. నిశ్చేష్టుడినైనాను —

ఉత్తర క్షణంలో, అంతా ఏదో లీలగా అర్థమైంది.

ఇంక ఆ బొద్దు అమ్మాయి మనకు లేదు – టైఫాయడ్ ఏ తెలియని లోకాలకో ఆ అమ్మాయిని తీసికెళ్ళింది.

నా గుండె ఆగిపోయింది.

అంత జనంలో, ఆ అమ్మాయి తల్లి నన్ను ఎక్కడి నించి చూచిందో, చూచిందే తడవుగా, "నాన్నా! నీ చెల్లెలు ఉదయం నించీ మాట్లాడడం లేదు – మాపైన అలిగింది. నీవైనా మాట్లాడించు తండ్రీ, మాట్లాడుతుందేమో"నని గొల్లు మన్నది.

ఆ పక్కన వున్న సన్నటి అమ్మాయి కూడా గొల్లు మన్నది —

నాకు దుఃఖం ఆగలేదు – వెల్లువగా పొంగుకొచ్చింది.

ఆ అమ్మాయికీ, నాకూ సంబంధ మేమిటనికూడా ఆలోచించకుండా నేనూ గొల్లుమన్నాను—

"ఒక్క-తల్లి పిల్లలు కాకపోయినా, ఆ అబ్బాయికీ, ఆ చనిపోయిన అమ్మాయికీ ఎంత పోలికవుంది?" అని ఎవ్వరో ఆ జనంలో అనుకోవడం, నాకు దూరంగా అంత దుఃఖంలో కూడా వినపడింది—

"చెల్లీ" అని గట్టిగా అరుస్తూ, నేను నేలమీద కుప్పగా కూలాను—

*　　*　　*　　*

జీవితంలో మహాప్రస్థానం ఆగిపోయింది—

నిరంతరాన్వేషణ నిలిచిపోయింది—

కాని ఆ నిరంతరాన్వేషణ, ఆ మహాప్రస్థానం స్మృతులు మాత్రం చెరగకుండా హృదయంలో నిలిచిపోయినాయి– అప్పటికీ, ఇప్పటికీకూడా—

★